క్లుప్తంగా

విద్యతోనే సమాజంలో మార్పు

రెంటాల(రెంటచింతల): విద్య ద్వారానే సమాజంలో మార్పు వస్తుందని భావించి, దళితుల విద్యాభివృద్ధి కోసం సోషల్ వెల్ఫేర్ అంబేడ్కర్ రెసిడెన్షియల్ స్కూల్స్‌ను స్థాపించడం జరిగిందని కార్డ్స్ సంస్థ డిప్యూటీ డైరెక్టర్ తాళ్లూరి అమర్నాథ్ అన్నారు. సోమవారం స్థానిక ఎస్సీ కాలనీలోని అంగన్వాడీ కేంద్రం విద్యార్థులకు ఆయన అంబేడ్కర్ గురుకుల పాఠశాల ప్రవేశం కోసం మోడల్ పేపర్లను అందజేశారు. పాఠశాలలను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. క్రమశిక్షణతో కూడిన విద్యతోనే సమ సమాజం ఏర్పడుతుందన్నారు. మాచర్ల ఆర్‌సీఓ పి.ప్రసాద్ మాట్లాడుతూ పల్నాడు ప్రాంతంలో కార్డ్స్ సంస్థ దళితుల పిల్లల విద్యాభివృద్ధికి కృషి చేస్తుందని హర్షం వ్యక్తంచేశారు. ఈ కార్యక్రమంలో రెంటచింతల ఎస్‌సీఓ వేల్పుల రవి, అంగన్వాడీ టీచర్ పాల్గొన్నారు.

ఆదర్శ పాఠశాల ప్రవేశానికి దరఖాస్తుల ఆహ్వానం


ప్రిన్సిపల్ కె.పాపయ్య

జెట్టిపాలెం (రెంటచింతల): జెట్టిపాలెం ఆదర్శ పాఠశాల(ఏపీ మోడల్ స్కూల్)లో 6వ తరగతి ప్రవేశానికి ఈ నెల 25 నుంచి మార్చి 31వ తేదీ లోపు ఆన్‌లైన్‌లో దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపల్ కె.పాపయ్య తెలిపారు. సోమవారం ఆయన పాఠశాలలో వివరాలు వెల్లడించారు. ప్రవేశ పరీక్షలో పొందిన మార్కులు, రిజర్వేషన్ల ప్రకారం సీట్లు కేటాయిస్తారన్నారు. ఓసీ, బీసీ విద్యార్థులు 2013 సెప్టెంబర్ 1 నుంచి 2015 ఆగస్టు 31వ తేదీ మధ్యలో జన్మించి ఉండాలని, ఎస్సీ, ఎస్టీ విద్యార్థులు నాలుగు సంవత్సరాలు మినహాయింపు ఉంటుందన్నారు. ఏప్రిల్ 20న ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు స్థానిక పాఠశాలలోనే ప్రవేశ పరీక్ష జరుగుతుందని తెలిపారు. ఓసీ, బీసీలకు రూ.150, ఎస్సీ, ఎస్టీలకు రూ.75 పరీక్ష ఫీజు అని చెప్పారు. పూర్తి వివరాలకు పాఠశాల 91829 58496 మొబైల్ నంబరుకు సంప్రదించాలన్నారు.

భోజనం వడ్డించిన కమిషనర్



మాచర్ల: పట్టణంలో మున్సిపల్ చైర్మన్ పోలూరి నరసింహారావు గుడ్ మార్నింగ్ కార్యక్రమం సోమవారం నిర్వహించారు. 1, 2 వార్డుల్లో అంగన్‌వాడీ కేంద్రాలు, అన్న క్యాంటీన్‌ను సందర్శించారు. క్యాంటీన్‌లో భోజనం నాణ్యతను అడిగి తెలుసుకుని, వచ్చిన వారికి భోజనం వడ్డించారు. ఈ కార్యక్రమంలో పలువురు అధికారులు పాల్గొన్నారు.

పలువురికి పిన్నెల్లి పరామర్శ



మాచర్ల: వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు పిన్నెల్లి రామకృష్ణారెడ్డి సోమవారం పలువురిని పరామర్శించారు. మాచర్ల పట్టణంలోని 8వ వార్డు సెరీన్ కాలనీకి చెందిన సీనియర్ నాయకుడు యోహాన్ అనారోగ్యంతో చికిత్స పొంది విశ్రాంతి తీసుకుంటున్నారు. ఆయనను స్వగృహంలో పీఆర్కే పరామర్శించారు. ఆరోగ్య పరిస్థితి తెలుసుకుని, అండగా ఉంటానని భరోసానిచ్చారు. అలాగే అదే వార్డుకు చెందిన ఇటీవల మృతి చెందిన లాజరయ్య కుటుంబ సభ్యులను పిన్నెల్లి పరామర్శించి, ధైర్యం చెప్పారు. లాజరయ్య చిత్రపటానికి పూలమాల వేసి, నివాళులర్పించారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు ఆయన వెంట ఉన్నారు.

ఘనంగా ధ్వజస్తంభ వేడుకలు



గురజాల: నగర పంచాయతీ పరిధిలోని సుంకర కుంట సమీపంలో ఉన్న గంగా పార్వతి సమేత అమరలింగేశ్వర స్వామి దేవాలయంలో సోమవారం ధ్వజస్తంభం, కీర్తి ధ్వజ రాతిశిఖర స్థాపన వేడుకలు నిర్వహించారు. ఆలయ అభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో దంపతులు పీటలపై కూర్చుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ప్రతి ఒక్కరిపై స్వామి వారి కటాక్షం ఉండాలని కోరారు. భక్తులకు అన్నప్రసాదం అందజేశారు. ఈ కార్యక్రమంలో దేవాలయ కమిటీ సభ్యులు, ఆలయ అర్చకుడు సుధాకర్ తదితరులున్నారు.

ప్రత్యేక గుర్తింపు సంఖ్యతో రైతుకు మేలు

- అర్హులకే పథకాలు అమలు
- నెలాఖరుకు ప్రతి రైతుకు సంఖ్య జారీ


రైతు సేవా కేంద్రంలో రైతులు

గురజాల: సంక్షేమ పథకాలు అర్హులకే అందించాలనే లక్ష్యంతో కేంద్ర ప్రభుత్వం ప్రతి రైతుకు 11 అంకెల గల విశిష్ట సంఖ్యను జారీ చేస్తోంది. నేరుగా లబ్ధి చేకూర్చేందుకు ఫార్మర్ రిజిస్ట్రీ పేరుతో రైతుల వివరాలు నియోజకవర్గంలోని ప్రతి రైతు సేవా కేంద్రంలో నమోదు చేస్తున్నారు. తదుపరి కౌలు రైతులకు కూడా ఈ తరహా నంబరును జారీ చేయనున్నట్లు అధికారులు వెల్లడిస్తున్నారు.

ప్రయోజనాలు

ఆన్‌లైన్‌లో ప్రతి రైతు వ్యక్తిగత భూ వివరాలు నమోదు చేసి, ఆధార్ సంఖ్య తరహాలో ఒక ప్రత్యేక గుర్తింపు సంఖ్య కేటాయిస్తున్నారు. ఈ సంఖ్య ద్వారా అవసరమైన సమయాల్లో అర్హులైన రైతులను అధికారులు గుర్తిస్తారు. వారికి పంటల బీమా, పీఎం కిసాన్, అన్నదాత సుఖీభవ, వ్యవసాయ పరికరాల రాయితీలు, పంట నష్టపరిహారం తదితరాలు అందజేస్తారు. సాగునీటి సంఘాల సమస్యలు, పంటల తెగుళ్లు, ఇతర వ్యవసాయ సలహాలు సైతం అధికారులు నుంచి నేరుగా పొందేందుకు అవకాశం ఉంటుంది.

50 శాతం నమోదు పూర్తి

గురజాల నియోజకవర్గంలోని గురజాల, దాచేపల్లి, మాచవరం, పిడుగురాళ్ల మండలాల్లో ఇప్పటి వరకు 50 శాతం నమోదు కార్యక్రమం పూర్తయినట్లు ఆయా శాఖ అధికారులు వెల్లడించారు. వ్యవసాయ భూమి ఉన్న ప్రతి రైతు అర్హుడేనని ,రైతు ఆధార్‌కు ఫోన్ నంబర్ అనుసంధానమై ఉండాలని తెలిపారు. పట్టాదారు పాసుపుస్తకం , ఆధార్ జిరాక్స్, ఆధార్‌కు లింకు అయిన ఫోన్ తీసుకుని రైతు సేవా కేంద్రంలో సిబ్బంది వద్దకు వెళ్లాలని అధికారులు తెలుపుతున్నారు. ఆన్‌లైన్‌లో వివరాలు పొందుపరుస్తారు. ఆన్‌లైన్ నందు పూర్తి కాగానే రైతు ఫోన్‌కు ఓటీపీ వస్తుంది. ఓటీపీని ఆన్‌లైన్ నందు నమోదు చేస్తే పూర్తవుతుంది.

ప్రతి రైతు నమోదు చేసుకోవాలి



కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఫార్మర్ యూనిక్ ఐడీ కార్యక్రమంలో భాగంగా ప్రతి రైతు విధిగా నమోదు చేసుకుని విశిష్ట సంఖ్యను పొందాలి. ఈ ఐడీ ద్వారా రైతులు ప్రభుత్వం అందించే సంక్షేమ పథకాలు పొందేందుకు దోహదపడుతుంది. రైతు సేవా కేంద్రాల్లో రైతులు వెళ్లి ప్రత్యేక నంబరును పొందాలి. రైతు సేవా కేంద్రంలో వ్యవసాయ శాఖ సిబ్బంది అందుబాటులో ఉంటారు.

– శ్రీకృష్ణదేవరాయులు, ఏడీఈ, పిడుగురాళ్ల

విశిష్ట గుర్తింపు సంఖ్యను పొందాలి


కల్లంలోని కందులను పరిశీలిస్తున్న ఏవో సంధ్యారాణి

గురజాల రూరల్: భూమిని కలిగి ఉన్న రైతులు విధిగా విశిష్ట గుర్తింపు సంఖ్యను పొందాలని మండల వ్యవసాయాధికారిణి ఎం.సంధ్యారాణి సూచించారు. మండల పరిధిలోని పులిపాడు, గంగవరం గ్రామంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చేపడుతున్న విశిష్ట గుర్తింపు సంఖ్య మంజూరు కార్యక్రమాన్ని సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విశిష్ట గుర్తింపు సంఖ్య ఉంటే ప్రభుత్వం నుంచి వచ్చే సంక్షేమ పథకాలు దరిచేరుతాయన్నారు. ఆనంతరం కల్లాల్లో ఉన్న కందులను పరిశీలించారు. ప్రభుత్వం కందులు కొనుగోలు కేంద్రాలను ప్రారంభించడం జరుగుతుందని కందులు అమ్మదలచిన వారు రైతు సేవా కేంద్రాలకు వెళ్లి సమాచారం ఇవ్వాలన్నారు. క్వింటా మద్దతు ధర రూ.7,550గా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో రైతులు పాల్గొన్నారు.

శివరాత్రి ఏర్పాట్లు పూర్తి



గురజాల: శివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని ఏర్పాట్లు పూర్తయినట్లు ఆలయ కార్యనిర్వహణాధికారి ఎం.పూర్ణ చంద్రరావు తెలిపారు. మండల పరిధిలోని దైద గ్రామంలో ఉన్న శ్రీ అమరలింగేశ్వర స్వామి దేవాలయంలో సోమవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బుధవారం ఉదయం 3.30 నుంచి దేవాలయంలో పూజలు, అభిషేకాలు నిర్వహించడం జరుగుతుందని చెప్పారు. భక్తులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా చర్యలు చేపట్టినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో పిన్నెల్లి దుర్గాప్రసాద్ శర్మ, సంజీవ్ శర్మ సిబ్బంది ఉన్నారు.

మున్సిపల్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి


మున్సిపల్ డీఈఈకి వినతిపత్రం అందిస్తున్న ఏఐటీయూసీ నాయకులు

చిలకలూరిపేట: మున్సిపల్ కార్మికుల సమస్యలను పరిష్కరించాలని సీపీఐ ఏరియా ఇన్‌చార్జి కార్యదర్శి తాళ్లూరి బాబూరావు, ఏఐటీయూసీ ఏరియా కార్యదర్శి దాసరి వరహాలు ప్రభుత్వాన్ని కోరారు. సోమవారం మున్సిపల్ కార్యాలయం ఎదుట ఏఐటీయూసీ అనుబంధ ఏపీ మున్సిపల్ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో కార్మికులు నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వేతనాల చెల్లింపు, పనుల అప్పగింత, నిర్వహణ, సాంఘిక భద్రత మున్సిపల్ శాఖకే పూర్తి బాధ్యతలు ఉండాలని కోరారు. ప్రైవేట్ ఏజెన్సీలకు అప్పజెప్పొద్దని విజ్ఞప్తి చేశారు. అవుట్ సోర్సింగ్ కార్మికులను పర్మినెంట్ చేయాలని కోరారు. ఉద్యోగులకు పెండింగ్‌లో ఉన్న సరెండర్ లీవ్ ఎన్‌క్యాష్‌మెంట్, మూడు డీఏలు సత్వరం విడుదల చేయాలని కోరారు. ఇంజనీరింగ్ కాంట్రాక్ట్ సిబ్బందికి సంక్షేమ పథకాలు వర్తింప చేయాలని డిమాండ్‌చేశారు. గత 15 సంవత్సరాలుగా స్కూల్ స్వీపర్లకు వేతనాలు పెంచలేదని, సత్వరమే పెంచాలని కోరారు. మరణించిన రిటైర్మెంట్ కార్మికుల స్థానంలో వారి కుటుంబ సభ్యులకు పనులు కల్పించాలని విజ్ఞప్తి చేశారు. కార్మికుల రిటైర్‌మెంట్ వయస్సు 62 సంవత్సరాలకు పెంచాలని కోరారు. అనంతరం మున్సిపల్ డీఈఈ షేక్ అబ్దుల్ రహీంకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో మున్సిపల్ వర్కర్స్ యూనియన్ నాయకులు కొమరగిరి చెంచయ్య, ఆక్కులయ్య, అంజయ్య, జయరావు పాల్గొన్నారు.

పేద యువతి వివాహానికి సాయం



పిడుగురాళ్ల: పట్టణంలోని రసూల్ పేటకు చెందిన పేద మైనార్టీ యువతి వివాహానికి పట్టణ టీఎస్‌టీయూసీ కమిటీ ఆధ్వర్యంలో అధ్యక్షుడు యరగాని వెంకట్, జిల్లా మైనార్టీ అధ్యక్షుడు సయ్యద్ అమీర్ చేతుల మీదుగా రూ. 25 వేలు విలువ చేసే డబుల్ కాట్, బీరువా సోమవారం అందజేశారు. జనతా గ్యారేజీ సైదా, బాలయ్య, యరగాని హనుమంతరావు, సతీష్, ఆటో సైదా, వెంకట్, నాగేశ్వరరావు, నాగరాజు, పృధ్వీ, కాజా నాయక్, అల్లా బక్షు, అలీ పాల్గొన్నారు.

గీతమ్స్‌లో ఘనంగా ఫేర్‌వెల్ డే వేడుకలు


విద్యార్థినికి జ్ఞాపిక అందజేస్తున్న ప్రభుత్వ చీఫ్ విప్ జీవీ

వినుకొండ: పట్టణంలోని సిద్ధార్థ నగర్‌లోని గీతమ్స్ హైస్కూల్ ప్రాంగణంలో సోమవారం ఫేర్‌వెల్ డే వేడుకలు ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా ప్రభుత్వ చీఫ్ విప్, స్థానిక ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు లక్ష్యాన్ని ఎంపిక చేసుకొని దాని సాధన కోసం శ్రమించాలని చెప్పారు. శ్రద్ధగా చదివి విజయాలను అందుకోవాలని తెలిపారు. అనంతరం గత సంవత్సరం పదో తరగతిలో ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులతో పాటు మెడికల్, ఐఐటీ, ఎన్ఐటీలలో సీట్లు సాధించిన విద్యార్థులు, వారి తల్లిదండ్రులను ఘనంగా సత్కరించి జ్ఞాపికలు అందజేశారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే మక్కెన మల్లికార్జునరావు, గీతమ్స్ విద్యా సంస్థల కరస్పాండెంట్ మాలపాటి కోటిరెడ్డి, ఎంఈవో సయ్యద్ జఫ్రుల్లా, పీవీ సురేష్, ఆయూబ్‌ఖాన్ పాల్గొన్నారు.

వ్యక్తి ఆత్మహత్య

పిడుగురాళ్ల: వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న ఘటన పట్టణంలోని జానపాడు రోడ్డులోని సోమవారం తెల్లవారుజామున జరిగింది. ఘటనకు సంబంధించి స్థానికుల వివరాల మేరకు.. శ్రీనివాసరావు అనే వ్యక్తి జానపాడు రోడ్డులో తన కార్యాలయంలో మనస్తాపానికి గురై ఫ్యాన్‌కు ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడికి భార్య, ఇద్దరు ఆడ పిల్లలున్నారు. ఈ ఘటనపై పట్టణ పోలీస్ స్టేషన్‌లో ఎటువంటి కేసు నమోదు కాలేదని, పోలీసులు తెలిపారు.

స్కూల్ బస్సు ఢీకొని వ్యక్తి మృతి

దాచేపల్లి: శ్రీచైతన్య టెక్నో స్కూల్ బస్సు ఢీకొని వ్యక్తి మృతి చెందిన ఘటన సోమవారం జరిగింది. నెల్లూరు జిల్లా కావలి మండలం ముసునూరుకు చెందిన ఉప్పు గోపాల్ (32) మృతి చెందాడు. ఎస్సై పాపారావు తెలిపిన వివరాల మేరకు.. నడికుడి బ్రిడ్జి వద్ద రోడ్డు పనుల్లో మృతుడు గోపాల్ పనిచేస్తున్నాడు. రోడ్డుపై స్టిక్కర్లు అంటిస్తున్న సమయంలో నారాయణపురంలోని శ్రీచైతన్య టెక్నో స్కూల్ బస్సు అతనిని ఢీకొట్టింది. తీవ్రంగా గాయపడిన గోపాల్‌ను పిడుగురాళ్లలోని ఆసుపత్రికి తరలిస్తున్న సమయంలో మార్గ మధ్యంలో మృతిచెందినట్లు ఎస్సై తెలిపారు. మృతుని కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు చెప్పారు. ప్రమాదానికి కారణమైన బస్సు డ్రైవర్ ఎం.సైదులును అదుపులోకి తీసుకున్నామని వెల్లడించారు.

పరిసరాల పరిశుభ్రతతోనే ఆరోగ్య పరిరక్షణ


చెత్త సేకరణను పరిశీలిస్తున్న రబ్బాని

నూజెండ్ల: స్వర్ణాంధ్ర–స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమంలో భాగంగా మండలంలోని 27 గ్రామ పంచాయతీల్లో చెత్త సంపద కేంద్రాలు అమల్లోకి వచ్చేలా పంచాయతీ అధికారులు చర్యలు చేపట్టారు. సోమవారం ఈవోపీఆర్డీ షేక్ రబ్బాని మాట్లాడుతూ గ్రామాల్లో చెత్తా చెదారాన్ని ఎక్కడబడితే అక్కడ వేయవద్దని తెలిపారు. పరిసరాల పరిశుభ్రతతోనే ఆరోగ్య పరిరక్షణ సాధ్యమని పేర్కొన్నారు. పారిశుద్ధ్య సిబ్బంది ఇంటి దగ్గరకు వచ్చినప్పుడు రిక్షాలో వేయాలని చెప్పారు. దాన్ని చెత్త సంపద కేంద్రానికి తరలించి తడి, పొడి చెత్తా వేరుచేసి పంచాయతీకి అదనపు ఆదాయం వచ్చేలా చర్యలు తీసుకుంటామని చెప్పారు. కార్యక్రమంలో సర్పంచ్ వీర్ల వెంకటస్వామి, పంచాయతీ కార్యదర్శి ప్రభాకర్, హసన్ పీరా,స్వచ్ఛ భారత్ మండల రిసోర్స్ కోఆర్డినేటరు కంచర్ల శివరామయ్య , గ్రామపెద్దలు లగడపాటి సూరిబాబు, వెంకట్రావు, క్లాప్ మిత్రలు పాల్గొన్నారు.

ప్రభుత్వ కార్యక్రమాల్లో పాల్గొనడం తప్పనిసరి

డీఆర్‌డీఏ ప్రాజెక్ట్ డైరెక్టర్ హీరాలాల్


సమావేశంలో మాట్లాడుతున్న హీరాలాల్

రొంపిచర్ల : ప్రభుత్వ కార్యక్రమాల్లో డీఆర్‌డీఏ సిబ్బంది పాల్గొనాలని ప్రాజెక్ట్ డైరెక్టర్ కె.హీరాలాల్ తెలిపారు. స్థానిక మండల సమాఖ్య కార్యాలయంలో సోమవారం సమీక్ష సమావేశం నిర్వహించారు. ఇందులో పాల్గొన్న హీరాలాల్ మాట్లాడుతూ ప్రాజెక్ట్ లక్ష్యాలను పూర్తి చేయాలని చెప్పారు. సీఐఎఫ్, వీఆర్‌ఎఫ్, ఉన్నతి, స్త్రీనిధి, బ్యాంక్ లింకేజ్ పథకాలపై అవగాహన కలిగించారు. రుణాలను నూరు శాతం వసూలు చేయాలని తెలిపారు. స్త్రీనిధి ఎన్‌పీఏ ఉన్న గ్రూపు సభ్యులకు నోటీసులు జారీ చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో ఏపీఎం సోమశేఖర్, సీసీలు సత్యనారాయణరాజు, పార్వతి, ఆదిలక్ష్మి, అకౌంటెంట్ రాధిక, సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థులకు పరీక్ష సామగ్రి పంపిణీ



శావల్యాపురం: పదో తరగతి ఫైనల్ పరీక్షల్లో విద్యార్థులంతా ఉత్తమ ఫలితాలు సాధించాలని ఎంపీడీవో పేరుమీనా సీతారామయ్య తెలిపారు. స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాల్లో సోమవారం పదో తరగతి విద్యార్థులకు వీడ్కోలు సభ నిర్వహించారు.ఈ సందర్భంగా ఎంపీడీవో సీతారామయ్య మాట్లాడుతూ తరగతి గదుల్లో ఉపాధ్యాయులు బోధించిన అంశాలను విద్యార్థులు శ్రద్ధగా చదువుకోవాలని సూచించారు. పరీక్షల సమయంలో ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని చెప్పారు. అనంతరం విద్యార్థులకు పరీక్ష సామగ్రి కిట్లు అందజేశారు. కార్యక్రమంలో ఎంఈవో పుసులూరి లలితకుమారి, శ్రీరామా పబ్లిక్ స్కూల్ కరస్పాండెంట్ కనగాల వెంకట రామ మోహన్‌చంద్, ప్రధానోపాధ్యాయురాలు బొడ్డపాటి విజయలక్ష్మి, విద్యా కమిటీ చైర్మన్ పాటిబండ్ల శ్రావణ్‌కుమార్, ఉపాధ్యాయులు కుమ్మరి శ్రీనివాసరాజు, భువనేశ్వరి,అబ్దుల్లా, నిర్మల పాల్గొన్నారు.

భక్తులు పోలీసులకు సహకరించాలి



సత్రశాల(రెంటచింతల): మహా శివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని సత్రశాలలోని శైవక్షేత్రం గంగా భ్రమరాంబ సమేత మల్లికార్జునస్వామి దేవస్థానానికి తరలివచ్చే భక్తులు ప్రశాంతంగా దైవ దర్శనం చేసుకునేలా చర్యలు చేపట్టినట్లు ఎస్ఐ సీహెచ్ నాగార్జున తెలిపారు. సోమవారం సత్రశాలలో విలేకర్లతో ఏర్పాట్లపై ఆయన మాట్లాడారు. గురజాల, రెంటచింతల నుంచి వచ్చే వాహనాలకు మిట్టగుడిపాడు రోడ్డు మార్గాన అనుమతి లేదని తెలిపారు. వారు పాలువాయి జంక్షన్, పశర్లపాడు, జెట్టిపాలెం నుంచి దేవస్థానానికి చేరుకోవాలని చెప్పారు. అన్నదాన సత్రాలకు సరుకులు, ఇతర వస్తువులు తెచ్చుకునేందుకు పాస్‌లు ఉన్న వారు మాత్రమే వాహనాలను సత్రాలలో నిలుపుకోవాలన్నారు. పాస్‌లు లేని భక్తులు పోలీసులు చూపిన పార్కింగ్ స్థలంలో వాహనాలను నిలుపుకోవాలని స్పష్టం చేశారు. ఆటోలను సత్రశాల వడియరాజుల సత్రం వరకు అనుమతిస్తామన్నారు. ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో దేవస్థానం పరిసరాల్లో రాజకీయ పార్టీల నాయకుల ఫ్లెక్సీలను ఏర్పాటు చేస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్రశాంతంగా దైవదర్శనం చేసుకుని, పూజా కార్యక్రమాలు నిర్వహించి తిరిగి వెళ్లేలా ప్రతి ఒక్కరూ పోలీసు సిబ్బందికి, వలంటీర్లకు సహకరించాలని కోరారు.


అబాకస్‌లో విద్యార్థుల ప్రతిభ



ప్రతిభ కనబర్చిన విద్యార్థులను అభినందిస్తున్న ఉపాధ్యాయులు

మాచర్ల: అంక గణిత సమస్యలను తేలిగ్గా చేయగలిగే సాధనమే అబాకస్ అని ఆకృతి ఎడ్యుకేషన్ ఫౌండర్ రాము, అబాకస్ ట్రైనర్ వెంకటేశ్వరరావు అన్నారు. పట్టణంలోని కృష్ణవేణి టాలెంట్ స్కూల్‌లో అబాకస్‌లో ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు సోమవారం అభినందన సభ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వారు మాట్లాడుతూ అంక గణితంలో సంకలనం, వ్యవకలనం, గుణకారం, భాగహారం వంటి చతుర్విధ ప్రక్రియలను అబాకస్ పద్ధతిలో సులువుగా చేయవచ్చన్నారు. చార్లెస్ బబేజ్ కనుగొన్న అబాకస్ మూల ఆధారంగా అంచలంచలుగా లెక్కలు కట్టే సాధనాలు రూపొందించబడుతుందన్నారు. పాఠశాలలో నేర్పించే అబాకస్ ట్రైనింగ్ వల్ల లెక్కల్లో పట్టు సాధించవచ్చన్నారు. అబాకస్ పరీక్షల్లో ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు అతిథులు, పాఠశాల డైరెక్టర్ డాక్టర్ శివ బహుమతులు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపల్, పాఠశాల ఇన్‌చార్జిలు గౌరీ, నాగజ్యోతి, శ్రీలక్ష్మీ రెడ్డి, వ్యాయామ ఉపాధ్యాయుడు అంజయనాయక్, సిబ్బంది పాల్గొన్నారు.

కొండకు వస్తున్నాం కోటయ్యా !


కోటప్ప కొండకు వెళుతున్న కాకాని ప్రభ


విద్యుత్ కాంతుల్లో అప్పాపురం ప్రభ


అమీన్ సాహెబ్‌పాలెం గ్రామ ప్రభ

గ్రామాల నుంచి సందడిగా బయలుదేరిన ప్రభలు

నరసరావుపేట రూరల్: మండలం నుంచి మూడు భారీ విద్యుత్ ప్రభలు కోటప్ప కొండకు వెళ్లేందుకు సిద్ధమయ్యాయి. కాకాని, గురవాయపాలెం, ఉప్పలపాడు గ్రామాల నుంచి విద్యుత్ ప్రభలు ఏర్పాటు చేశారు. కాకాని విద్యుత్ ప్రభ సోమవారం ఉదయం గ్రామం నుంచి బయలుదేరింది. గ్రామస్తులు అంతా ప్రభ వెంట నడిచారు. గ్రామంలో పండుగ వాతావరణం నెలకొంది. రాత్రికి ప్రభల నిధికి చేరింది. ఉప్పలపాడు ప్రభను సోమవారం నిలబెట్టారు. సాయంత్రం ఊరి చివరకి తరలించారు. మంగళవారం కోటప్ప కొండకు చేరుకోనుంది. గురవాయపాలెం ప్రభ కూడా మంగళవారం కొండకు బయలుదేరనుంది.

పోట్లూరు ప్రభ సిద్ధం

మహా శివరాత్రి పురస్కరించుకొని కోటప్పకొండ తిరునాళ్లకు ఏటా మండలంలోని పోట్లూరు గ్రామం నుంచి వంతులు వారీగా మొక్కుబడి ప్రభ తయారు చేసి తరలించడం ఆనవాయితీగా వస్తోంది. బ్రిటిష్ పాలనలో పొలాల దగ్గర వివాదాలు ఎక్కువయ్యాయి. అప్పట్లో పోలీసులు కేసులు కూడా నమోదు చేశారు. కోర్టులో కొన్ని సంవత్సరాలు వాదనలు జరిగాయి. విసుకెత్తిన గ్రామస్తులు కోర్టు కేసు గెలుపు కోసం కోటయ్య స్వామిని ప్రార్థించారు. విజయం సాధిస్తే ఏటా ప్రభలతో వస్తామని మొక్కుకున్నారు. కేసులో విజయం సాధించడంతో గ్రామస్తులు ఐక్యంగా ఏటా వంతులు ప్రకారం కోటప్పకొండ తిరునాళ్లకు ప్రభను ఏర్పాటు చేస్తున్నారు. కొండపై కోటయ్య స్వామిని నేరుగా గర్భగుడిలోకి వెళ్లి దర్శించడానికి అప్పట్లో బ్రిటిష్ కాలం నాటి పోలీసులు ఇచ్చిన అనుమతి పత్రం ఉందని గ్రామస్తులు తెలిపారు.ఈ సందర్భంగా మంగళవారం విద్యుత్ ప్రభను ఏర్పాటు చేసి, రాత్రి గ్రామంలో వైభవంగా ఊరేగించారు.శివరాత్రి పర్వదినం రోజున నందీశ్వరుని విగ్రహాలతో ప్రభను కోటయ్య కొండకు ట్రాక్టర్లపై తరలిస్తారు.

ప్రభలకు గ్రామోత్సవం

నాదెండ్ల: మహాశివరాత్రిని పురస్కరించుకుని మండలంలోని అమీన్‌సాహెబ్‌పాలెం, అప్పాపురంలో గ్రామ భారీ విద్యుత్ ప్రభలు సిద్ధమయ్యాయి. గత నెల రోజులుగా గ్రామస్తులు నిర్మిస్తున్నారు. సోమవారం రాత్రి గ్రామాల్లో రెండు ప్రభలకు గ్రామోత్సవం నిర్వహించారు. ఒక్కో ప్రభ 90 అడుగుల ఎత్తుతో రూ.40 లక్షల వ్యయంతో ఏర్పాటు చేశారు. మహిళలు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం సాంస్కృతిక కార్యక్రమాలు జరిగాయి. మంగళవారం ప్రభలు కోటప్పకొండలోని త్రికోటేశ్వరస్వామి సన్నిధికి బయలుదేరతాయి. 26వ తేదీ ఉదయానికి నిర్దేశిత ప్రాంతానికి చేరుకోనున్నాయి. పండుగ రోజు రాత్రి దేదీప్యమానంగా విద్యుత్ కాంతులతో వెలిగిపోనున్నాయి. ప్రభల వద్ద సాంస్కృతిక కార్యక్రమాలు జరుగుతాయి. అనంతరం తిరిగి స్వగ్రామాలకు బయలుదేరతాయి. చివరగా మరోసారి ప్రభలకు గ్రామోత్సవం నిర్వహిస్తారు.

విశ్రాంత హెచ్‌ఎం పిచ్చిరెడ్డి మృతి


నివాళి అర్పిస్తున్న మాజీ శాసనసభ్యుడు డాక్టర్ గోపిరెడ్డి

రొంపిచర్ల : మండలంలో సంతగుడిపాడు గ్రామానికి చెందిన విశ్రాంత ప్రధానోపాధ్యాయులు కురుగంటి పిచ్చిరెడ్డి (85) సోమవారం అనారోగ్యంతో మృతి చెందారు. ఆయన కుమారుడు కురుగంటి శ్రీనివాసరెడ్డి ప్రస్తుతం వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్‌గా పని చేస్తున్నారు. విషయం తెలుసుకున్న మాజీ శాసన సభ్యుడు డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి ఆయన భౌతిక కాయాన్ని సందర్శించి నివాళులర్పించారు. ఉపాధ్యాయుడిగా, ప్రధానోపాధ్యాయుడిగా పిచ్చిరెడ్డి ఎందరో విద్యార్థులను భావిభారత పౌరులుగా తీర్చిదిద్దారన్నారు. ఆయన మృతి విద్యారంగానికి తీరని లోటని తెలిపారు. పిచ్చిరెడ్డి కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. కార్యక్రమంలో పలువురు వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.